ఫ్రీ లెఫ్ట్.. ప్రయాణం సులువు

- ఫతేనగర్ ఫ్లై ఓవర్ కింద ఆక్రమణల తొలగింపు
- బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎస్.శ్రీనివాసులు పర్యవేక్షణలో కొనసాగుతున్న చర్యలు
- ఇక వాహనదారులకు సులువైన ప్రయాణం

ఫతేనగర్ ఫ్లైఓవర్ కింద రోడ్డు ఆక్రమణల తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న ఏసీపీ శ్రీనివాసులు

అమీర్‌పేట్, ఆగస్టు 14: బల్కంపేట-సనత్‌నగర్ మార్గంలో ఫతేనగర్ ఫ్లైఓవర్ కింది నుంచి వాహనదారులు ఫ్రీ లెఫ్ట్ తీసుకునేందుకు వీలుగా ఈ మార్గంలో అడ్డంకులను తొలగించే పనులను ట్రాఫిక్ అధికారులు చేపట్టారు. సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ ఆదేశాల మేరకు రెండు రోజులుగా ఫతేనగర్ ఫ్లైఓవర్ కింద ఆక్రమణలు తొలగించే పనులు బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎస్.శ్రీనివాసులు పర్యవేక్షణలో చురుగ్గా సాగుతున్నాయి. ముఖ్యంగా ఫ్లైవోవర్ కింద ఉన్న చర్చి మార్గంతో పాటు లోధా క్లబ్‌హౌస్ నుంచి సనత్‌నగర్ బస్టాండ్‌కు ఫరాషా కేఫ్ మీదుగా చేరుకునే మార్గంపై దృష్టి సారించినట్టు ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. బల్కంపేట నుంచి సనత్‌నగర్ బస్టాండ్ వరకు ఫ్లైవోవర్ కింద ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఫ్రీ లెఫ్ట్ తీసుకునే విధంగా మార్గాన్ని తీర్చిదిద్దుతామన్నారు. దీంతో బల్కంపేట నుంచి సనత్‌నగర్‌కు చేరుకునేందుకు వాహనదారులు ఫ్లైవోవర్ మీద నుంచి కాకుండా కింద నుంచి లింక్ రోడ్డు మీదుగా వెళతారని, ఆ విధంగా ఫ్లైవోవర్ మీద ట్రాఫిక్ కూడా గణనీయంగా తగ్గుతుందన్నారు. ప్రధానంగా ఫ్లైవోవర్ కింద చర్చి దాటిన తరువాత, లోధా క్లబ్ హౌస్ దాటిన తరువాత ఫరాషా కేఫ్ సమీపంలో రోడ్లపై నెలకొన్న డెబ్రిస్‌ను తొలిగిస్తే వాహనాలు మరింత సాఫీగా ముందుకు సాగుతాయని, ఈ మేరకు జీహెచ్ఎంసీ అధికారులకు లేఖ రాసినట్టు తెలిపారు. ఒకటి రెండు రోజుల్లో ఇక్కడి ఆక్రమణలు పూర్తిగా తొలగిచేందుకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సురేశ్, ఎస్సై మాజిద్ అలీ కృషి చేస్తున్నట్టు ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు.

వివిధ కోర్సుల ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 14: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ (స్పెషల్ ఎడ్యుకేషన్) ఎంఆర్ఐ, ఎల్‌డీ, హెచ్ఐ, ఏఎస్‌డీ కోర్సులతో పాటు పీజీడీసీఏ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

బీఈ పరీక్ష తేదీల ఖరారు

ఓయూ పరిధిలోని బీఈ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. బీఈ (ఏఐసీటీఈ) అన్ని విభాగాల రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, బీఈ (సీబీసీఎస్) అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, బీఈ (నాన్ సీబీసీఎస్) అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, వన్ టైం చాన్స్ పరీక్షలను ఈనెల 28 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

నేడు అడ్డగుట్టలో భారీ జాతీయ జెండా ర్యాలీ

అడ్డగుట్ట, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అడ్డగుట్టలో తిరంగా ఫ్రెండ్స్ యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నేడు 2200 ఫీట్ల భారీ జాతీయ జెండాతో ర్యాలీని నిర్వహిసున్నట్లు అసోషియేషన్ నిర్వాహకులు బుధవారం తెలిపారు. 11 ఏండ్లుగా జాతీయ జెండా ర్యాలీని నిర్వహిస్తున్నామని, ఈ సారి కూడా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. అడ్డగుట్ట బీ సెక్షన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ర్యాలీ మొదలవుతుందని, అడ్డగుట్ట చౌరస్తా నుంచి చంద్రయ్య హోటల్, షెనాయ్ నర్సింగ్ హోం, సంగీత్ చౌరస్తా, రైల్ నిలయం అంబేద్కర్‌నగర్, ఈస్ట్ మారేడుపల్లి మీదుగా అడ్డగుట్టకు చేరుకుంటుందన్నారు. ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

చరిత్ర ప్రాముఖ్యత నానాటికీ పెరుగుతోంది

ప్రొఫెసర్ అడపా సత్యనారాయణను సన్మానిస్తున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 14: ప్రస్తుత మారుతున్న కాలంలో చరిత్ర ప్రాముఖ్యత నానాటికీ పెరుగుతోందని ఉస్మానియా యూనివర్సిటీ హిస్టరీ విభాగం మాజీ హెడ్ ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ అన్నారు. విధాన రూపకల్పనలో సమకాలీన ఔచిత్యంతో వివిధ సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలపై లోతైన విచారణను అందించేందుకు చరిత్ర ఉపయోగపడుతుందని వివరించారు. ఓయూ హిస్టరీ విభాగం ఆధ్వర్యంలో 'హిస్టరీ అండ్ ఇట్స్ రిలవెన్స్'అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ అడపా మాట్లాడుతూ చరిత్రను గతం యొక్క అధ్యయనంగా మాత్రమే కాకుండా సజీవ వర్తమానంగా భావించాలని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వంలో ఉన్నతపదవులకు నిర్వహించే పోటీ పరీక్షల్లో సైతం హిస్టరీ ఎంతో ముఖ్యమైనదని చెప్పారు. చరిత్ర విద్యార్థులు జ్ఞానాన్ని సంపాదించేందుకు, విజయాన్ని పొందేందుకు మల్టీల్యాటరల్ విధానాన్ని అవలంబించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సయీదా తలత్ సుల్తానా, చరిత్ర విభాగం హెడ్ ప్రొఫెసర్ బి.లావణ్య, ప్రొఫెసర్ ఇందిర, డాక్టర్ పి.రమేశ్, డాక్టర్ యాలాల శివానంద్, డాక్టర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

'అంతరిక్ష రంగ అభివృద్ధిలో సారాభాయ్ కృషి'

జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలకు హాజరైన విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 14: భారత అంతరిక్ష రంగ అభివృద్ధిలో సారాభాయ్ కృషి ఎంతో ఉందని ఇస్రో శాస్త్రవేత్తలు డాక్టర్ పి.శ్రీలత, ప్రదీప్‌కుమార్ అన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ఓయూ ఈసీఈ విభాగంలో వేడుకలను నిర్వహించారు. ఇస్రో శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పరిశోధనల్లో భాగస్వామ్యమయ్యేందుకు విద్యార్థులకున్న అవకాశాలను వివరించారు. అంతరిక్ష పరిశోధనల్లో ఇస్రో ప్రపంచానికి నాయకత్వం వహిస్తోందని చెప్పారు. విద్యార్థులు విమర్శనాత్మకంగా ఆలోచించేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రశేఖర్, విశ్రాంత ఐఏఎస్ అధికారి అశోక్‌కుమార్, ప్రొఫెసర్ నవీన్‌కుమార్, డాక్టర్ శ్రీలత, తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 14: జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఓయూలో బుధవారం ఘనం గా నిర్వహించారు. అంతరిక్ష పరిశోధనలో దేశం సాధించిన విజయాలను జరుపుకునేందుకు ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఖగోళ శాస్త్రం విభాగం (ఆస్ట్రానమీ డిపార్ట్‌మెంట్) ఆధ్వర్యంలో 'ఇండియన్ స్పేస్ జర్నీ'పై వర్క్‌షాప్ నిర్వహించారు. తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (టీజీకాస్ట్) సహకారంతో నిర్వహిస్తున్న ఈ వర్క్‌షాప్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా టీజీకాస్ట్ మెంబర్ సెక్రెటరీ శ్రీలక్ష్మి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థల్లో సైన్స్ అండ్ టెక్నాలజీని ప్రోత్సహించేందుకు తాము ఆర్థిక సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఎన్ఆర్ఎస్‌సీ శాస్త్రవేత్త డాక్టర్ ఈశ్వర్ దాస్, బిట్స్ పిలాని హైదరాబాద్ క్యాంపస్‌కు చెందిన డాక్టర్ రుచి జైన్ డే మాట్లాడుతూ స్పేస్ డేటా విశ్లేషణ, జియోసైన్స్‌లో అప్లికేషన్ల ద్వారా భూవిపత్తుల గురించి తెలుసుకోవచ్చని అన్నారు. అంతరిక్ష డేటాకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఓయూ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కరుణసాగర్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వీరయ్య, వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ కె.చెన్నారెడ్డి, హెడ్ డాక్టర్ శాంతిప్రియ తదితరులు హాజరయ్యారు.

వర్క్‌షాప్‌ను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న అతిథులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 14: ఆటోడ్రైవర్లందరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చిలకలగూడ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు సూచించారు. ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో వివేకానంద నగర్, పద్మారావునగర్ ప్రాంతాల్లో ఆటోడ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు కచ్చితంగా ఖాకీ చొక్కా వేసుకొని ఆటో నడిపించాలని అన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

మహిళలపై హింసను ముక్త కంఠంతో ఖండించాలి



గాంధీ దవాఖానలో జూడాల ధర్నాకు సంఘీభావం తెలుపుతున్న మంత్రి సీతక్క

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 14: మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను, హింసను ముక్త కంఠంతో ఖండించాలని మంత్రి సీతక్క అన్నారు. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన లైంగికదాడి, హత్య ఘటనను నిరసిస్తూ బుధవారం గాంధీ దవాఖానలో జూడాలు, పీజీ వైద్యులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. విధులను బహిష్కరించి ప్రధాన భవనం వద్ద బైఠాయించారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన మంత్రి సీతక్క, సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి, ఆర్ఎంఓ డాక్టర్ శేషాద్రి ధర్నా శిబిరం వద్దకు వచ్చారు. మహిళలను పూజించే దేశంలో ఇలాంటి సంఘటనలు తరచుగా జరుగడం బాధాకరమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళల రక్షణకు కఠినమైన చట్టాలు ఉన్నాయని వివరించారు. వైద్య వృత్తిలో ఎంతో భవిష్యత్తు ఉన్న ట్రైనీ వైద్యురాలిపై జరిగిన దుశ్చర్యను ఖండిస్తున్నామన్నారు. అనంతరం జూడాలు గాంధీ దవాఖానలో ర్యాలీ నిర్వహించారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

యువ టూరిజం క్లబ్ పోస్టర్ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 14: ఓయూ చరిత్ర, ఆర్కియాలజీ విభాగాలు సంయుక్తంగా ప్రారంభించిన యువ టూరిజం క్లబ్ పోస్టర్‌ను ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సయీదా తలత్ సుల్తానా బుధవారం ఆవిష్కరించారు. దేశ పర్యాటక ప్రదేశాలపై అవగాహన కల్పించేందుకు క్లబ్ దోహదపడనుంది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌షెఫర్డ్, చరిత్ర విభాగం మాజీ హెడ్ ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ, హెడ్ ప్రొఫెసర్ లావణ్య, ప్రొఫెసర్ ఇందిర, డాక్టర్ రమేశ్, డాక్టర్ శివానంద్ పాల్గొన్నారు.

నకిలీ పత్రాలు సృష్టించిన ముఠా సభ్యుల అరెస్టు

మారేడ్‌పల్లి, ఆగస్టు 14: నకిలీ ప్రతాలు సృష్టించి ఖాళీ స్థలాన్ని విక్రయించేందుకు ప్రయత్నించిన ముఠా సభ్యులను కార్ఖాన పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం నార్త్ జోన్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ సాధన రష్మి పెరుమాళ్ వివరాలను వెల్లడించారు. కార్ఖాన పోలీసు స్టేషన్ పరిధిలోని ఏడబ్లూహెచ్ కాలనీలోని విశ్రాంత కల్నల్ కృష్ణారావుకు చెందిన 450 గజాల ఖాళీ స్థలం ఉంది. 1982లో కృష్ణారావు కొనుగోలు చేశారు. స్థలాన్ని అమ్మేందుకు ఈసీ తీసుకున్నారు. దీంతో స్థలం మరొకరి పేరున రిజిస్ట్రేషన్ అయినట్టు తెలిసింది. కంగుతిన్న కృష్ణారావు వెంటనే కార్ఖాన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. బోయిన్‌పల్లికి చెందిన కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులందరూ ఒక ముఠాగా ఏర్పడి పాత రిజిస్ట్రేషన్ చేసిన భూముల నకిలీ పత్రాతో భూములను కాజేయాలని పథకం పన్నారు. 1982లో భూమి కొనుగోలు సమయంలో విధానం లేకపోవడాన్ని ఆసరాగా చేసుకొని కృష్ణారావు పేరుతో ఉబైద్ బిన్ మహమ్మద్ ఆధార్‌కార్డును ఫోర్జరీ చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు తేలింది. నిందితులు రవూఫ్ పాషా, సాయినాథ్, అబిద్, అహ్మద్, షేక్ అమీద్, బీమ్‌సింగ్ ముఠాగా ఏర్పడి వారే రిజిస్ట్రేషన్ చేయించుకొని విక్రయించేందుకు ప్లాన్ వేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న కార్ఖాన పోలీసులు నిందితులను అరెస్టు చేశారు.

బలహీన వర్గాల అభ్యున్నతికి జీపీఎం స్వామి కృషి

బొల్లారం: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి దివంగత నాయకుడు జీపీఎం స్వామి ఎంతో కృషి చేశారని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. బుధవారం బోయిన్‌పల్లి చిన్న తోకట్ట సంజీవయ్య నగర్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బస్తీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, మధుకర్, అశోక్, మానవరావు, హరికృష్ణ, వరప్రసాద్, యాదయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

యూజీసీ నెట్ తప్పనిసరి నిర్ణయాన్ని విరమించుకోవాలి

ఓయూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 14: ఓయూలో పీహెచ్‌డీ ప్రవేశాలకు యూజీసీ నెట్ తప్పనిసరి అనే నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య డిమాండ్ చేశారు. ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సత్య మాట్లాడుతూ పీహెచ్‌డీ ప్రవేశాలను యూజీసీ నెట్ స్కోర్ ద్వారా నిర్వహించాలనే నిర్ణయాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఇటీవలే నీట్ పరీక్ష పేపర్ లీకై పరీక్షను రద్దు చేశారని గుర్తుచేశారు. నెట్ పరీక్షకు హిందీ, ఇంగ్లిష్ భాషల్లో మాత్రమే నిర్వహించడం వల్ల ఉత్తరాది విద్యార్థులు లాభపడతారని అన్నారు. మిగితా భాషల విద్యార్థులకు నష్టం చేకూరుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీ నిర్ణయంతో విశ్వవిద్యాలయ స్వయం ప్రతిపత్తి సైతం దెబ్బతినే అవకాశం ఉంటుందని వాపోయారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



అధికారితో సమావేశమైన కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, ఆగస్టు 14: రేషన్ కార్డుల సమస్యలను పరిష్కరించాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ సివిల్ సప్లై అధికారులను కోరారు. బుధవారం సికింద్రాబాద్‌లోని సివిల్ సప్లై కార్యాలయంలో అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్ కల్యాణ్‌తో సమావేశమయ్యారు. ఇటీవల ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల వివరాలు తెలిపారు. కొంత మంది తెల్ల రేషన్ కార్డులను తొలగిస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నూతన రేషన్ కార్డుల గురించి అడుగగా ఇంకా ప్రభుత్వం విధి విధానాలు వెల్లడించలేదని, కుటుంబ సభ్యులను చేర్చుకోవడానికి మాత్రమే ఆప్షన్ ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

బన్సీలాల్‌పేట్‌లో జాతీయ జెండాలను ప్రదర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రతిఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండా ప్రదర్శించాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. బుధవారం బన్సీలాల్‌పేట్‌లో బీఆర్ఎస్ నాయకులు అబ్బాస్, రజాక్, జహంగీర్, నాగభూషణం, కుశాల్ తదితరులు జాతీయ జెండాలను బస్తీలోని ప్రతిఇంటికి వెళ్లి పంపిణీ చేసారు. జాతీయ భావానికి, దేశభక్తికి కుల, మతాలు ఉండవని, దేశరులందరూ సోదరభావంతో కలిసిమెలిసి ఉండాలన్నదే తమ ఉద్దేశమని వారు అన్నారు.

జాతీయ జెండాల పంపిణీ

సికింద్రాబాద్: ప్రధాని మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ పే తిరంగాలో భాగంగా బీజేపీ నాయకులు సీతాఫల్‌మండిలో జాతీయ పతాకాలను పంపిణీ చేశారు. సీతాఫల్‌మండి అధ్యక్షుడు అంబాల రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో సికింద్రాబాద్ కన్వీనర్ కనకట్ల అరవింద్ హరి నాయకులతో కలిసి ఇంటింటికీ జాతీయ జెండాలను పంపిణీ చేశారు.

బ్రాహ్మణ బస్తీలో ..

బ్రాహ్మణబస్తీలో బీజేపీ నాయకులు ఇళ్లపై జాతీయ పతాకాలను ఎగురవేశారు. మీడియా జాయింట్ కోఆర్డినేటర్ అజయ్‌నాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ స్వరూప పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్, వేణుగోపాల్, లక్ష్మణ్, జగదీశ్, రాజేశ్వరిచారి పాల్గొన్నారు.

జాతీయ పతాకాల పంపిణీ

అమీర్‌పేట్: బీజేపీ అగ్ర నాయకత్వం ఇచ్చిన పిలుపుమేరకు స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని 'హర్ ఘర్ పే తిరంగా' కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వెల్లాల రామ్మోహన్ ఆధ్వర్యంలో జాతీయ పతాకాలను పంపిణీ చేశారు. సనత్‌నగర్ ఎస్ఆర్టీ క్వార్టర్స్‌లో జరిగిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు దయానంద్, చైతన్య కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సనత్‌నగర్ ఎస్ఆర్టీ క్వార్టర్స్‌లో జాతీయ జెండాల పంపిణీ

తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు అరెస్టు

వివరాలను వెల్లడించిన నార్త్ జోన్ డీసీపీ



విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న నార్త్ జోన్ డీసీపీ సాధన రష్మి పెరుమాల్

మారేడ్‌పల్లి, ఆగస్టు 14: జైలుకెళ్లి బెయిల్‌పై వచ్చి తప్పించుకొని తిరుగుతున్న ఇద్దరిని కార్ఖాన పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు నార్త్ జోన్ డీసీపీ సాధన రష్మి పెరుమాల్ తెలిపారు. జార్ఖండ్ రాంచికి చెందిన అర్మాన్ అలాం (24), బీహార్‌కు చెందిన దీపక్‌యాదవ్ (25), నిజామాబాద్‌కు చెందిన బొమ్మకంటి ప్రదీప్‌కుమార్‌గౌడ్ (24) అక్షయ్ చంద్రశేఖర్ సూర్య వంశీ అలియాస్ యాబ (26)లు నార్త్ జోన్ పరిధిలోని పలు పోలీసు స్టేషన్లలో నమోదైన కేసుల్లో జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చారు. కోర్టుకు హాజరు కాకపోవడంతో న్యాయస్థానం వీరిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. కాగా వారెంట్‌పై కార్ఖాన పోలీసులు దృష్టిని సారించారు. ఇందులో అర్మాన్ అలాం, రమేశ్‌యాదవ్‌ను అదుపులోకి తీసుకొని న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టారు. బొమ్మకంటి ప్రదీప్‌కుమార్‌ను కాచిగూడ పోలీసులు అరెస్టుచే రిమాండ్‌కు తరలించగా, అక్షయ్ చంద్రశేఖర్ సూర్య వంశీ అనారోగ్యంతో మృతి చెందాడు.

తండ్రి మందలించడంతో..

రాంచీకి చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి కుమారుడు అర్మాన్ అలాం 12 ఏండ్ల క్రితం సిగరెట్టు తాగడడంతో తండ్రి మందలించాడు. దీంతో ఇంటి నుంచి పారిపోయి రైల్లో నగరానికి చేరుకున్నాడు. అప్పటి నుంచి నేరాల బాట పట్టాడు. 11 కేసుల్లో జైలుకెళ్లి బెయిల్‌పై వచ్చాడు. తిరిగి కోర్టుకు హాజరుకాలేదు. అర్మాన్ అలాం కూత్బుల్లాపూర్‌లో ఉన్నట్లు గుర్తించిన కార్ఖాన పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. నగరానికి వచ్చినప్పటి నుంచి పుట్‌పాత్‌ల పై ఉంటూ నేరాల బాట పట్టానని ఒప్పుకున్నాడు.

కన్నీటి పర్యంతమైన తల్లి..

తమ కొడుకు తప్పిపోయాడని 12 ఏండ్ల క్రితమే అహెరి పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. కాగా కార్ఖాన పోలీసుల అదుపులో ఉన్న అర్మాన్ అలాం వివరాలను జార్ఖండ్‌లోని అహెరి పోలీసులకు చేరవేశారు. విషయాన్ని అక్కడి పోలీసులు అర్మాన్ తల్లిదండ్రులకు చెప్పారు. వెంటనే సమాచారం అదుకున్న వారు కార్ఖాన పీఎస్‌కు చేరుకొని 12 ఏండ్ల క్రితం దూరమైన తన కుమారుడిని చూసిన తల్లి సుందర్‌రావు అలాం కన్నీటి పర్యంతమైంది.

నేడు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

సికింద్రాబాద్, ఆగస్టు 14: నేడు స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఉదయం సికింద్రాబాద్ ఎమ్మెల్యే టి.పద్మారావుగౌడ్ వేడుకల్లో పాల్గొంటారు. కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలతో కలిసి సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ పతకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం టీఆర్‌టీ క్వార్టర్స్, సీతాఫల్‌మండి స్ట్రీట్ నంబర్ 3, మధురానగర్ కాలనీలో జాతీయ పతాకాల ఆవిష్కరణ కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధురానగర్ కాలనీ పార్కులో ఓపెన్ జిమ్ పరికరాలను కార్పొరేటర్ హేమతో కలిసి ప్రారంభిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ అధికారులు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సెల్ ఫోన్ చోరీ నిందితుల అరెస్టు

మారేడ్‌పల్లి, ఆగస్టు 14: రైల్వే ప్రయాణికుడిని బ్లేడ్‌తో బెదిరించి సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లిన ఇద్దరు యువకులతో పాటు ఇద్దరు మైనర్లను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తుర్కపల్లికి చెందిన కొణిపాక ప్రశాంత్ (21) ప్రైవేటు ఉద్యోగం చేస్తూ మల్కాజ్‌గిరిలో ఉంటున్నాడు. వరంగల్ కాజీపేటకు చెందిన బూసియా శాంసన్ (19) డెకరేషన్ వర్క్ చేస్తూ మల్కాజ్‌గిరి ప్రశాంత్‌నగర్‌లో ఉంటున్నాడు. వీరు ఇద్దరు మైనర్లతో కలిసి చోరీల బాట పట్టారు. ఈనెల 9న యాదాద్రి భువనగిరికి చెందిన కొమ్ము ప్రశాంత్, అతడి స్నేహితుడు కుంటి మహేశ్‌బాబుతో కలిసి జనగామకు వెళ్లేందుకు మౌలాలి రైల్వేస్టేషన్‌కు వచ్చారు. సాయంత్రం 5 గంటలకు రైలు కోసం ప్లాట్‌ఫారంపై వేచి ఉన్నారు. ఇద్దరు మైనర్లతో వచ్చిన ప్రశాంత్, బూసియా శాంసన్ ప్లాట్‌ఫాంపై ఉన్న వారిని సెల్‌ఫోన్ ఇవ్వాలని అడిగారు. వారు ఇవ్వకపోవడంతో బ్లేడ్‌తో బెదిరించి సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తుండగా, బుధవారం లాలాగూడ రైల్వేస్టేషన్ పట్టాల వద్ద ఇద్దరు నిందితులతోపాటు ఇద్దరు మైనర్లు అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మైనర్లను జువైనల్ హోంకు తరలించారు.